క్లుప్తంగా

నేడు పల్లిసారధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

వజ్రపుకొత్తూరు రూరల్: పల్లిసారధి గ్రామంలో బుధవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్యానాయుడు మంగళవారం తెలిపారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు.

మంచినీటి కల్పనే ధ్యేయం



శంకుస్థాపన చేస్తున్న దువ్వాడ వాణి

నందిగాం: ప్రతి ఇంటికి మంచినీటి సౌకర్యం కల్పించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. దిమిలాడలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.50 లక్షలతో చేపట్టనున్న మంచినీటి పథకం పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి ఈ పథకం ద్వా రా కుళాయిలు ఏర్పాటు చేసి స్వచ్ఛమైన నీటిని అందించడం జరుగుతోందన్నారు. దిమిలాడ పీఏసీఎస్ అధ్యక్షుడు బాలక మధు, జేసీఎస్ కన్వీనర్ జద్యాడ జయరాం, నాయకులు కింతల ధర్మారావు, మాదిన గోపాలకృష్ణ, తమిరె ఫాల్గుణరావు, పోలాకి మోహనరావు, కణితి నారాయణమూర్తి, సైలాడ లావన్న, అట్టాడ శ్రీనివాసరావు, బాలక ప్రభాకరరావు పాల్గొన్నారు.

జీడి కార్మికులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని జీడి కార్మికులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు మంగళవారం చేపట్టారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పలాస కాష్యూలాండ్ వనిత విభాగం ఆధ్వర్యంలో జెమ్స్ వైద్య బృందం పరీక్షలు చేశారు. బీపీ, ఈసీజీ, కంటి వైద్య పరీక్షలను సుమారు 105 మందికి చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. లయన్స్‌క్లబ్ వనితా విభాగ అధ్యక్షురాలు మల్లా జయశ్రీ, కార్యదర్శి శ్వేతా, ట్రెజరర్ ఎం.సంతోషి, వైద్య సిబ్బంది బొడ్డాపు చిన్నారావు, రాపాక తిరుపతిరావు, ఇచ్ఛాపురం ప్రదీప్ పాల్గొన్నారు.

తక్షణసాయం అందజేత

పలాస: బ్రాహ్మణతర్లా గ్రామానికి చెందిన పఠాన్ బాబ్జీ ఇటీవల మృతి చెందాడు. ఈయన వైఎస్సార్ బీమా లబ్ధిదారుడు. దీంతో తక్షణ సాయంగా రూ. పది వేలు మంజూరైంది. ఈ మొత్తాన్ని గ్రామ సర్పంచ్ బాడాన పుష్ప.. బాబ్జీ కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. ఎంపీటీసీ సభ్యురాలు తుంగాన రవణమ్మ, పంచాయితీ కార్యదర్శి లక్ష్మణ రేఖ, వెల్ఫేర్ అసిస్టెంటు చాణిక్య, బత్తుల హేమలత, జగదీశ్వరి పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల సర్వే



సర్వేను పరిశీలిస్తున్న రాహుల్‌కుమార్‌రెడ్డి

టెక్కలి: ఇంటింటా ఓటర్ల సర్వేను పక్కాగా నిర్వహించాలని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. టెక్కలిలోని శ్రీనివాసానగర్ ప్రాంతంలో పోలింగ్ స్టేషన్ 99, 102 పరిధిలో నిర్వహిస్తున్న ఇంటింటా ఓటర్ల సర్వేను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు ఏవిధంగా ఓటర్ల సర్వే చేస్తున్నారనే విషయాన్ని ఆరా తీశారు. తహసీల్దారు ప్రవల్లికప్రియ, డీటీ అనిల్‌కుమార్ ఉన్నారు.

సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లండి

నందిగాం: ప్రభుత్వం చేస్తున్న సేవలను సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నందిగాం–1, 2, దిమ్మడిజోల సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో జగనన్న సురక్ష అమలు, జరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధిపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నతాశయంతో దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి గ్రామస్వరాజ్య స్థాపన చేశారని కొనియాడారు. ఎంపీడీవో శివప్రసాద్, జేసీఎస్ కన్వీనర్ జద్యాడ జయరాం, కురమాన బాలక్రిష్టారావు, మడపాల సంజీవరావు, అంబోడి విష్ణు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థినికి సాయం

మందస:సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన తెలుకుల ఈశ్వరి ట్రిపుల్ ఐటీ సీటు సాధించింది. పేద కుటుంబానికి చెందిన ఈమెకు హెచ్ఎం అనిల్‌సాల్మన్‌రాజు, ఉపాధ్యాయులు ఎస్.అప్పారావు, నారాయణరావు, చంద్రశేఖర్, వెంకటరమణ, చంటిబాబు, విజయ, తులసీదాసులు కొంత ఆర్థికసాయాన్ని మంగళవారం అందజేశారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

మందస: ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మందస పట్టణంలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా అభివృద్ధి పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్నారన్నారు. అర్హులైన లబ్ధిదారులకు సాంకేతిక కారణాలతో పథకాలు అందకపోతే జగనన్న సురక్ష ద్వారా అందివ్వడానికే ఈ పథకం అమలు చేయడం జరుగుతోందన్నారు. ప్రతి ఒక్కరికీ పథకాలు అందివ్వడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. తల్లి గర్భంలో ఉన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అనేక పథకాలతో ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు.

మారిన మందస రూపురేఖలు

గత పాలకుల హయాంలో నిర్లక్ష్యానికి గురైన మందస రూపురేఖలు తమ ప్రభుత్వ హయాంలో మారాయని మంత్రి అన్నారు. కనీసం రోడ్లను కూడా గౌతు కుటుంబం వెడల్పు చేయలేకపోయిందని ధ్వజమెత్తారు. మేజరు పంచాయతీ మందసలో రహదారుల వెడల్పు, డివైడర్లు, సెంటర్ లైటింగ్, మంచినీటి పథకాలు, బస్టాండ్, మరుగుదొడ్లు, శ్రీరాజాశ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. ప్రజలు అభివృద్ధిని గమనించాలన్నారు. అనంతరం మందస బస్టాండ్‌లో విశ్రాంత భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

వలస నాయకులతో రాజకీయాలు

తనతో తలపడే శక్తిలేక తెలుగుదేశం పార్టీ నాయకులు వలస నేతలను కట్టగట్టుకుని తీసుకువస్తున్నారని మంత్రి అప్పలరాజు వ్యాఖ్యానించారు. గతంలో హామీలకే పరిమితమైన నాయకులు.. నేడు జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్నారన్నారు. ప్రజలు ప్రభుత్వానికి, తనకు అండగా ఉన్నారన్నారు. పేద కుటుంబాలు అభివృద్ధి చెందుతుండడంతో ప్రతిపక్షం సహించుకోలేక, పసలేని ఆరోపణలు చేస్తున్నాయన్నారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోయారని, వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను దాదాపుగా నెరవేర్చిందన్నారు. రాష్ట్రంలో పేదలకు అందిస్తున్న పథకాలను నిలిపివేయడానికి రాష్ట్రం అప్పులపాలవుతుందని కేంద్రానికి లేఖ రాసిన కుట్రదారుడు చంద్రబాబు అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ నాయకులంతా ఏకంగా ప్రజలను ఏమార్చడానికి ప్రయత్నిస్తారని, ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దని హితవు పలికారు. తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మందస సర్పంచ్ చెరుకుపల్లి యల్లమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ, వైస్ ఎంపీపీలు సీర ప్రసాద్, కొర్నాని ఆదినారాయణ, ఎంపీటీసీ సభ్యులు కంచి బెహరా, దువ్వ గౌరమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, పట్టణ అధ్యక్షుడు సిందిరి జగన్, బాలిగాం పీఏసీఎస్ చైర్మన్ సాౖర డిల్లేశ్వరరావు, ప్రత్యేకాధికారి బి.లవరాజు, ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు, ఉద్యానవనశాఖాధికారి సీహెచ్ శంకర్‌దాస్, ఏపీవో బి.వి.హరికృష్ణ, ఏపీఎం గొడబ ప్రసాదరావు, పార్టీ మండల యువజన కార్యదర్శి శనాపతి కిశోర్‌కుమార్, పార్టీ నాయకులు చెరుకుపల్లి లక్ష్మణమూర్తి, మట్ట ఆనందరావు, బరాటం జయప్రకాశ్, ఏఏసీ అధ్యక్షుడు సనపల కామేశ్వరరావు, సచివాలయాల కన్వీనర్ చింతాడ గణపతి, యర్రగుంట్ల కృష్ణమోహన్, మట్ట ఆనందరావు, దువ్వ జగదీష్ పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు అర్థరహితం



గ్రామ వలంటీర్లుగా ఎక్కువగా మహిళలే ఉన్నారు. స్వచ్ఛందంగానే పని చేస్తున్నాం. ఎక్కడా ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా వేకువజామునే నిద్రలేచి సేవలందిస్తున్నాం. అటువంటి తమపై పవన్‌కల్యాణ్ విమర్శలు చేయడం అర్థరహితం. ప్రజల డేటాతో అసలు మాకు సంబంధంలేదు. రాజకీయంగా ఆరోపణలు చేయడానికి ఏమీ లేకపోవడంతో పవన్ వలంటీర్ వ్యవస్థపై ఆరోపిస్తున్నారు. వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి. రాజకీయ పరిపక్వత లేని పవన్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు.

– కొర్నాని ఝాన్సీ, వలంటీరు, మందస

సమన్వయంతోనే అభివృద్ధి

- మండల సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

ఇచ్ఛాపురం రూరల్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరిస్తూ మండలాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ఎంపీపీ బోర పుష్ప అధ్యక్షతన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, అంగన్‌వాడీ కేంద్రాల పనులను త్వరితగతిగా పూర్తి చేసి వచ్చే నెల మూడో తేదీ నాటికి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని మండల ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పీఎం జీఎస్‌వై నిధులు రూ.10.50 కోట్లతో డొంకూరు–బూర్జపాడుకు సంబంధించి శిథిలావస్థలో ఉన్న కాజ్ వేను కూల్చివేసి అదే ప్రదేశంలో హైలెవిల్ వంతెన నిర్మాణం, అలాగే డొంకూరు గ్రామానికి ఆనుకొని శిథిలావస్థకు చేరుకున్న వంతెన స్థానంలో రూ.6.30 కోట్లతో నూతన వంతెన నిర్మాణాలకు త్వరలో టెండర్లను పిలిచి పనులు ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. తమ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరగడం, తీగెలు తెగిపోయే పరిస్థితిలో ఉన్నాయని.. తక్షణమే వాటిని మార్చాలని వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి, తేలుకుంచి, కేధారిపురం సర్పంచ్‌లు పి.రాజశేఖరరెడ్డి, ఎస్.సారధిరెడ్డి కోరారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దామని, పాఠశాలల్లో ఉపాధ్యాయ సిబ్బందిని నియమించామని, జగనన్న కిట్లు పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందజేశామని ఎంఈవో కురమాన అప్పారావు తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్ర, వైస్ ఎంపీపీలు దువ్వు వివేకానందరెడ్డి, దున్న గురుమూర్తి, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, ఉప తహసీల్దార్ సదాశివుని గురుప్రసాద్ పాల్గొన్నారు.

సామాజిక భవనానికి స్థలం కేటాయించాలి

- సబ్ కలెక్టర్‌కు కళింగ కార్పొరేషన్ చైర్మన్ తిలక్ వినతి



సబ్ కలెక్టర్‌కు జీవో కాపీని అందజేస్తున్న తిలక్, హేమసుందర్‌రాజు

టెక్కలి: కోటబొమ్మాళి మండలంలో కళింగ కల్యాణ మండపం, సామాజిక భవనం నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, డైరెక్టర్ సంపతిరావు హేమసుందర్‌రాజు కోరారు. ఈ మేరకు టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. కల్యాణ మండపం, సామాజిక భవనం మంజూరు చేయాలని ఇటీవల సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు శంకుస్థాపన కోసం విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ హేమసుందర్‌రాజు విన్నవించారు. ఈ మేరకు భవనం కోసం అనుకూలమైన స్థలాన్ని గుర్తించాలని బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో స్థలాన్ని గుర్తించాలని కోరుతూ తిలక్, హేమసుందర్‌రాజు తదితరులు జీవో కాపీలతో సహా సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు.

అర్హులందరికీ సంక్షేమం చేరువ

- జెడ్పీ చైర్‌పర్సన్ విజయ
- పోలేరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమాన్ని వివరిస్తున్న చైర్‌పర్సన్ విజయ

కంచిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరువయ్యావని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. పోలేరు సచివాలయం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని తెలియజేసి బ్రోచర్లను అందజేశారు. ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, స్థానిక ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, సర్పంచ్ బల్ల చారుమతి, తిరుపతి, దద్ద మోహనరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

సోంపేట: ఎర్రముక్కాం ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వేరే పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులను విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది మంగళవారం దుశ్శాలువలతో సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. సన్మానం పొందిన వారిలో ప్రధానోపాధ్యాయుడుగా పనిచేసిన యు.రమేష్, ఉపాధ్యాయులు పి.చంద్రశేఖర్, ఎస్.సాంబమూర్తి, ఎస్.విజయ, కె.రాజశేఖరరావు ఉన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎ.అనంత్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ డి.పాపారావు పాల్గొన్నారు.

ఎం.తోటూరులో పారిశుద్ధ్య పనులు

ఇచ్ఛాపురం రూరల్: మండపల్లి పంచాయతీ ఎం.తోటూరులో ప్రత్యేక పారిశుద్ధ్య పనులను మంగళవారం చేపట్టారు. సర్పంచ్ పిట్ట శశిరేఖ పర్యవేక్షణలో కార్మికులు కాలువల్లో పూడిక తీత, రోడ్డుకు ఇరువైపులా ఉండే పిచ్చి మొక్కలను తొలగించారు. వీధుల్లో బ్లీచింగ్ పౌడర్‌ను జల్లారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పిట్ట మామయ్య, ధర్మాన వెంకటరావు, రమేష్, చరణ్, బాబయ్య పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ రాజలక్ష్మి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని 23 వార్డుల్లో పారిశుద్ధ్యంపై శానిటేషన్ సెక్రటరీలు ప్రత్యేక దృష్టిసారించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి ఆదేశించారు. పురపాలక సంఘం కార్యాలయంలో సచివాలయం శానిటేషన్ సెక్రటరీలతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుద్ధ్యం క్షీణించకుండా దృష్టిసారించాలన్నారు. వీధుల్లో బ్లీచింగ్ చేయించాలని, వర్షపు నీరు నిలిచిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కాలువల్లో పూడికలు తొలగించాలన్నారు. కాలువల వద్ద పెరుగుతున్న పిచ్చిమొక్కలను తొలగించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. వలంటీర్ల సహకారంతో వార్డుల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో కమిషనర్ ఎన్.రమేష్ పాల్గొన్నారు.

వైభవంగా గ్రామ దేవత ఉత్సవాలు



మూలిపాడులో అమ్మవార్లను ఊరేగిస్తున్న దృశ్యం

మందస: ఖరీఫ్ సీజన్‌లో వరినాట్లు వేయడానికి ముందుగా రైతులు పూజించే గ్రామదేవత ఉత్సవాలు పలు గ్రామాల్లో వైభవంగా మంగళవారం నిర్వహించారు. మూలిపాడులో సర్పంచ్ గుసిరి వెంకటరావు ఆధ్వర్యంలో కొండమాకాలమ్మ ఉత్సవం, నూకాలమ్మతల్లి గ్రామదేవత చల్లదనం జరిగింది. ఆచార, సంప్రదాయాలతో అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. మేళ, తాళాలు మంగళ, వాయిద్యాలతో, పూర్ణకుంభాలతో ఊరేగింపు నిర్వహించారు. కాళికానృత్యంతో యువత కేరింతల నడుమ భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఉద్దాన ఆరాధ్యదైవం ఛండేశ్వరి సంబరం రాంపురంలో జరిగాయి. పగటి వేషాలు, వీధి నాటకాలు, తప్పెట గుళ్ల తదితర సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కులనాయుడు జుత్తు పరసయ్య ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి. గిరిజన ప్రాంతాలైన కొండలోగాం, రామరాయి, కిల్లోయి, డబారిసింగి ప్రాంతాల్లో కూడా ఉత్సవాలను జరిపారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో సమన్వయకర్త దువ్వాడ వాణి



మహిళకు బ్రోచర్‌ను అందజేస్తున్న సమన్వయకర్త దువ్వాడ వాణి

నందిగాం: ప్రతి కుటుంబంలో ఉన్న సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. ఆనందపురం పంచాయతీ మాదిగాపురం, సవరబాణాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను తెలియజేశారు. నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని వివరించి బ్రోచర్లను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పేదలకు వివిధ పథకాల ద్వారా మేలు చేస్తున్న జగనన్నను ఎదుర్కోలేని చంద్రబాబు.. పవన్‌కల్యాణ్‌తో లేనిపోని అబాండాలు వేయిస్తున్నారన్నారు. వాటిని పచ్చమీడియా దుష్ప్రచారం చేయడం తగదన్నారు. ప్రజలు నిజాలు తెలుసుకుని మేలు చేసిన వారికి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సంపతిరావు రాఘవరావు, దువ్వాడ హైందవి, స్థానిక సర్పంచ్ బాబూరావు, జేసీఎస్ కన్వీనర్ జద్యాడ జయరాం, నాయకులు రోణంకి ధర్మారావు, పైల ధర్మారావు, బి.మధు, మాదిన గోపాలకృష్ణ, పైల కరుణాకర్, కణితి నారాయణమూర్తి, పోలాకి మోహనరావు, అట్టాడ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జనానికి సు'రక్ష'



నందిగాం: దిమిలాడలో సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త దువ్వాడ వాణి తదితరులు



టెక్కలి: తొలుసూరుపల్లిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీడీవో హెచ్.వి.రమణమూర్తి, సర్పంచ్ దమయంతి



సంతబొమ్మాళిలో మాట్లాడుతున్న సమన్వయకర్త దువ్వాడ వాణి



మందస: తాళ్లగురంటిలో మాట్లాడుతున్న తహసీల్దార్ బడే పాపారావు



కంచిలిలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు



సోంపేట సచివాలయం-3 పరిధిలో సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎంపీపీ నిమ్మన దాస్



కోటబొమ్మాళి: రేగులపాడులో సర్టిఫికెట్లను అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకటరమణారావు



వజ్రపుకొత్తూరు: పాతటెక్కలిలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పాలిన శ్రీనివాసరావు తదితరులు

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం జనాన్ని రక్షణగా నిలుస్తోందని నాయకులు, అధికారులు అన్నారు. ఉచితంగానే 11 సేవలను ప్రజలకు అందిస్తున్నామన్నారు. టెక్కలి, ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో మంగళవారం కార్యక్రమం కొనసాగింది. దరఖాస్తు చేస్తున్న వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

సంక్షిప్తంగా...

సున్నావడ్డీ అర్హుల జాబితా విడుదల

కోటబొమ్మాళి: స్థానిక మేజర్ పంచాయతీలోని 250 డ్వాక్రా సంఘాలకు సంబంధించి నాలుగో విడత సున్నావడ్డీ అర్హుల జాబితాను స్థానిక సచివాలయంలో సర్పంచ్ కాల్ల సంజీవరావు మంగళవారం విడుదల చేశారు. జాబితాను నోటీస్‌బోర్డులో ప్రదర్శించారు. ఉప సర్పంచ్ అనపాన బాలకృష్ణ, వెల్ఫేర్ అసిస్టెంట్లు మాధవి, చంద్రకళ, వార్డు సభ్యుడు డబ్బీరు ప్రదీప్ పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతిభద్రతలు నెలకొల్పాలి

కాశీబుగ్గ: మణిపూర్‌లో చెలరేగిన హింసను అరికట్టి శాంతిభద్రతలు నెలకునేలా కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని పీడీఎస్‌యూ, సీఐటీయూ, సీపీఐ(ఎంఎల్) నాయకులు కోరారు. కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. నాయకులు మద్దిల మల్లేశ్వరరావు, చాపర వేణుగోపాలరావు, చాపర సుందరలాల్, నెయ్యిల గణపతి, పిన్నింటి నాగేశ్వరరెడి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి ఔదార్యం

సోంపేట: బేసిరామచంద్రాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థి చిచ్చుల కాశేశ్వరరావు ఔదార్యాన్ని చాటుకున్నారు. ప్రస్తుతం పాఠశాలలో చదువుతూ ప్రతిభ కనబర్చిన ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు జ్ఞాపిక, ప్రశంసా పత్రం , నగదు బహుమతులను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాసరావు, మండల జేసీఎస్ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ పాల్గొన్నారు.

గణితంపై భయాన్ని వీడాలి

వజ్రపుకొత్తూరు: విద్యార్థులు గణితంపై ఉన్న భయాన్ని విడనాడాలని ఎంఈఓ జి.వి.రమణమూర్తి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితంపై మంగళవారం కాంప్లెక్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయుడు జి.గోపాలకృష్ణ తొమ్మిదో తరగతి విద్యార్థులకు బీజగణితాన్ని రేఖాగణితంలో అనుసంధానం చేసి నిరూపించడం అనే అంశాన్ని మాదిరి పాఠ్యాంశంగా బోధన చేశారు. గణితంపై విద్యార్థులు ఆసక్తి చూపేలా మెలకువలతో కూడిన బోధన చేయాలని మండల గణిత సెక్రటరీ చింత ఉమారావు అన్నారు. ప్రధానోపాధ్యాయుడు గొల్లపల్లి లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు ఆర్.సురేష్, దిలీప్ సాహు, సోమేశ్వరరావు, కిరణ్, శంకరరావు, అన్నపూర్ణ, శోభారాణి, సీఆర్‌పీ ఎ.కృష్ణారావు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

టెక్కలి: తిర్లంగి పంచాయతీ పరిధి గంగాధరపేట గ్రామ రహదారికి మంగళవారం మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రహదారి గోతులు కావడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పంచాయతీ సహకారంతో గ్రామస్థులు రహదారి గోతులను పూడ్చి సమస్యను పరిష్కరించారు.

పారసాంబలో కాలువలు నిర్మిస్తాం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పదో వార్డులో ఉన్న పారసాంబ గ్రామంలో కాలువలు నిర్మిస్తామని మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు చెప్పారు. వార్డు ఇన్‌చార్జి శర్వాణ రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం పర్యటించి మాట్లాడారు. చిన్నపాటి వర్షానికి ఎక్కడికక్కడ నీరు నిలిచిపోవడం, ఇళ్లలో వాడుక నీరు కూడా నిలిచిపోతుడడంతో సమస్యగా మారిందన్నారు. పరిశీలనలో కమిషనర్ నాగేంద్రకుమార్, ఏఈ అవినాష్ ఉన్నారు.

రాష్ట్ర సదస్సుకు తరలిరండి

వజ్రపుకొత్తూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తు, కార్మిక, కర్షకుల హక్కుల సాధన కోసం ఈ నెల 30న విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సదస్సుకు తరలిరావాలని మండల రైతు సంఘ అధ్యక్షుడు టి.భాస్కరరావు, కార్యదర్శి కె.బాలాజీ కోరారు. ఈ మేరకు బెండి, నగరంపల్లి, గల్లి గ్రామాల్లో మంగళవారం పర్యటించి గోడ పత్రికను ఆవిష్కరించారు.